## కరెంట్ లేకపోతే ఎనుకటి కాలమే..



ఐనవోలు: ఇప్పుడు కరెంటు 24గంటలు సప్లై చేయడం వల్ల రైతులందరం ఎంతో సంతోషంగా ఎవుసాయం చేస్తుం. కరెంటు లేకపోతే ఎనుకటి కాలం వస్తది. కరెంటు ఎప్పటికీ ఇవ్వడం వల్ల ఎప్పుడు వీలుంటే గప్పుడు బాయిల కాడికి పోయి మోటర్ వేసి పంటలకు నీళ్లు పారిస్తున్నాం. ఒక వేళ 3, 5 గంటల కరెంటు వచ్చిందా, మళ్లీ రైతులందరం కరెంటు ఎప్పుడు వస్తుందా.. ఎప్పుడు మోటర్ వేయాలని ఎదురు చూస్తాం. కరెంటు వచ్చినంక అందరం ఒక్కసారే మోటర్లు వేస్తే మోటర్లు, స్టాటర్లు కాలిపోతయి. ఎనుకటి కాలం ముందటపడుతుంది. రైతులు వ్యవసాయం వదిలీ పని కోసం పట్నానికి వలసలు పోతారు.

*- పడిదల సమ్మారావు, కక్కిరాలపల్లి, రైతు*

## ధరణి పోర్టల్‌తోనే భూసమస్యలు పరిష్కారం



వర్ధన్నపేట: రాష్ట్రంలో కేసీఆర్ సార్ ధరణి పోర్టల్ తెచ్చిన తర్వాతే భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. గతంలో చేతితో రాసిన పహానీలు ఉండడం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. ఒకరి భూమిని మరొకరిపై రాయడం వల్ల గ్రామాల్లో నిత్యం గొడవలే జరుగుతుండేవి. కానీ సీఎం కేసీఆర్ సార్ వచ్చిన తర్వాత ధరణిని తేవడంతో రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు వచ్చాయి. రికార్డులు కూడా ఆన్‌లైన్‌లో ఉండడం వల్ల భూముల క్రమద్ధీకరణ ఆన్‌లైన్‌లోనే లభ్యమవుతుండడంతో ఇబ్బందుల్లేవు. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ధరణిని తీసివేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకులు ఎన్ని మాటలు చెప్పినా ఎవరూ నమ్మరు.

*- నాంపెల్లి వెంకన్న, రైతు, వర్ధన్నపేట*



## ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య

వర్ధన్నపేట, నవంబర్ 21: ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో ఎన్నికల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులైన అధికారులతో శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై కూడా అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించి బ్యాలెట్ పత్రాలను అధికారులు, సిబ్బందికి అప్పగించినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం వర్ధన్నపేటలో ఆర్‌వో కార్యాలయంలో జరుగుతున్న పోస్టర్ బ్యాలెట్ నిర్వహణ ప్రక్రియను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశ్వనీ తానాజీ వాకడే, ఏపీవో విజయ్‌సాగర్, పీవో, ఏపీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

## మార్కెట్‌కు పది రోజులు సెలవులు

కాశీబుగ్గ, నవంబర్ 21: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పది రోజులు సెలవులు ఇస్తున్నట్లు కార్యదర్శి బరుపాటి వెంకటేశ్ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు. 25న శనివారం వారంతపు యార్డు బంద్, 26న ఆదివారం, 27న కార్తీకపౌర్ణమి, గురునానక్ జయంతి, 28 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు ఎన్నికల సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ సెలవు దినాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని తెలిపారు. 5వ తేదీ నుంచి యథావిధిగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

## అనంతసాగర్‌లో పోలీస్ బలగాల కవాతు

హసన్‌పర్తి, నవంబర్ 21: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అనంతసాగర్‌లో మంగళవారం హసన్‌పర్తి సీఐ తుమ్మ గోపి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ (బీఎస్ఎఫ్) బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, అశోక్‌కుమార్, సురేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు చేస్తున్న పోలీస్ బలగాలు

# కాంగ్రెస్ గ్యారెంటీలను ఎవరూ నమ్మరు

- 70 ఏండ్లలో అధోగతి పాలైన తెలంగాణ
- ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలి
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు మంచి స్పందన
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్
- వర్ధన్నపేట మండలంలో విస్తృతంగా ప్రచారం




దమ్మన్నపేటలో ప్రజలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే రమేశ్ ర్యాలీ

వర్ధన్నపేట, నవంబర్ 21: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలు ఏమాత్రం నమ్మరని బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కట్ర్యాల, రామవరం, దివిటిపల్లి, దమ్మన్నపేట, బండౌతాపురం, అంబేద్కర్‌నగర్, బొక్కలగూడెం, ల్యాబర్తి, కొత్తపల్లి, ఇల్లంద గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం రాత్రి 8గంటల వరకు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా ప్రచారం, సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పదేళ్లుగా విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. రైతులకు సాగునీరు, వ్యవసాయ రంగానికి 24గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా అవసరాలను గుర్తించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కానీ 70 ఏళ్లుగా తెలంగాణకు అధోగతి పాలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రజల్లోకి వచ్చి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని, వారిని నిలదీయాలని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పాలనలో ఏవిధంగా గ్రామాలు అభివృద్ధి సాధించాయో ప్రజల ముందే ఉందన్నారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

### 'అరూరి'కి గ్రామాల్లో బ్రహ్మరథం


గ్రామాల్లో మంగళవారం ప్రచార కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఘనస్వాగతం పలికారు. అరూరి ప్రచార రథానికి మహిళలు, ప్రజలు బతుకమ్మలు, బోనాలతో స్వాగ తం పలికారు. మహిళలు తిలకం దిద్ది ఆయన వెంట ర్యాలీగా ప్రధాన కూడళ్లకు చేరుకున్నారు. ఎమ్మెల్యే ప్రచార రథంపై వెళ్తుండగా యువకులు, పార్టీ శ్రేణులు గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే ప్రచార రథం ముందు మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ ర్యాలీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రమేశ్ ప్రచార రథం పైనుంచి ప్రసంగిస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, ఆత్మ చైర్మన్ గోపాల్‌రావు, పార్టీ ముఖ్యనాయకులు సిలువేరు కుమారస్వామి, చొప్పరి సోమయ్య, ఎలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బండౌతాపురంలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న అరూరి

### బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

నయింనగర్, నవంబర్ 21: వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లికి చెందిన పలువురు మంగళవారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాస ఆవరణలో వారికి అరూరి రమేశ్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేశ్

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

ఐనవోలు, నవంబర్ 21: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మళ్లీ అధికారంలో వస్తే చేయనున్న పనులను వివరించారు. ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని మూడోసారి అధికారంలోని తీసుకురావాలని కోరారు. జడ్పీ కోఆప్షన్ మెంబర్ ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ సతీశ్, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేశ్, మాజీ ఎంపీటీసీ జ్యోతి, వార్డు మెంబర్లు పైడి, మహేందర్, రమేశ్, సమ్మయ్య, వెంకన్న, మధుకర్, భాస్కర్ పాల్గొన్నారు.

### పర్వతగిరిలో..

పర్వతగిరి: బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న పథకాలు తెలియజేసి, ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి చూసి అరూరికి ఓటు వేయాలని అభ్యర్థించారు. సర్పంచ్ చింతపట్ల మాలతీ సోమేశ్వర్‌రావు, పార్టీ మండల అధ్యక్షులు రంగు కుమార్‌గౌడ్, జూలపెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉపసర్పంచ్ రంగు జనార్ధన్‌గౌడ్, పార్టీ గ్రామ అధ్యక్షులు మేరుగు వేంకటేశ్వర్లు, దేవా కుమార్‌గౌడ్, బూత్ కన్వీనర్లు, నాయకులు కొండ వెంకన్న, బొట్ల మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఐనవోలు: ప్రచారంలో ఎంపీపీ మధుమతి



పర్వతగిరి: ప్రచారం చేస్తున్న రంగు కుమార్‌గౌడ్